

స్వయం ఉపాధికి ఊతం

- రాజీవ్ యువ వికాసం పథకానికి వెల్లువెత్తుతున్న దరఖాస్తులు
- రూ. 50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు మంజూరు
- ఈ నెల 14 వరకు గడువు పొడిగింపు

నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆసక్తి ఉన్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం అందించనున్నది. వివిధ స్థాయి రుణాలను బట్టి 100శాతం నుంచి 70 శాతం వరకు సబ్సిడీ వర్తిస్తుంది. ప్రస్తుతం ఆదాయ ధ్రువపత్రం లేకున్నా రేషన్ కార్డుతోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. అర్హత ఆధారంగా తీసుకునే రుణాన్ని బట్టి వంద శాతం నుంచి 70 శాతం వరకు సబ్సిడీ పొందేందుకు యువతకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చే బ్యాంకు రుణంతో సొంత వ్యాపారం, చిరు వ్యాపారాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గేదెలు, కోళ్లు, మైనర్ ఇరిగేషన్‌లను పెట్టి లబ్ధిపొందే అవకాశం కల్పించింది. ఆర్థిక పరిస్థితి, కుటుంబ నేపథ్యం, విద్యార్హతలు, వయసును దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఆదాయ ధ్రువ పత్రం లేకున్నా కేవలం రేషన్ కార్డుతోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దరఖాస్తులకు నేటితో గడువు ముగిసినా... యువత ఆసక్తి చూపుతుండటంతో ఈ నెల 14వ తేదీ వరకు పొడగించింది.

అర్హత ఇలా...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు సామాజిక వర్గాలకు చెందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయ అనుబంధ పథకాలకు 21-60 సంవత్సరాలు, వ్యవసాయేతర పథకాలకు 21-55 సంవత్సరాలు వయసు గల వారు అర్హులుగా ప్రకటించారు. కుటుంబంలో ఒకరు మాత్రమే తమకు వర్తించే పథకానికి వోబీఎంఎంఎస్ పోర్టల్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల లోపు, పుర పరిధిలో రూ. 2 లక్షల లోపు ఆదాయం ఉండాలి. ప్రభుత్వం రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణం అందించనుంది. రూ. 50 వేల వరకు రుణం పొందే వారికి 100 శాతం సబ్సిడీ, రూ. 50 వేల నుంచి రూ. 1 లక్ష వరకు 90 శాతం సబ్సిడీ, 10 శాతం బ్యాంకు రుణం, రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు 80 శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు రుణం, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం అందుతుంది. ప్రధానంగా మైనర్ ఇరిగేషన్ పథకాలకు బ్యాంకు రుణం లేకుండా 100 శాతం పూర్తి రాయితీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

15 వేలు దాటిన దరఖాస్తులు..

రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణం పొందేందుకు నిరుద్యోగ యువత ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి 15,261 దరఖాస్తులు వచ్చాయి. అందులో బీసీలు 8,373, ఎస్సీలు 5,320, ఎస్టీ లు 291, ముస్లిం మైనార్టీలు 1,277, క్రిస్టియన్ మైనార్టీల నుంచి 29 దరఖాస్తులు అందినట్లు అధికారుల ద్వారా తెలిసింది.

సద్వినియోగం చేసుకోవాలి



రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. అర్హత గల లబ్ధిదారులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ వోబీఎంఎంఎస్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీవో, పుర ప్రాంతాల వారు మునిసిపల్ కమిషనర్‌కు అందజేయాలి. పోర్టల్‌లో అప్‌లోడ్ సమస్య ఉంటే సంబంధిత కార్యాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు ఆదాయ ధ్రువపత్రం లేకున్నా రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబంలో ఒకరు మాత్రమే పథకానికి అర్హులు.

-ఎంపీ రమేశ్‌బాబు, జిల్లా బీసీ కార్పొరేషన్ అభివృద్ధి శాఖాధికారి, గద్వాల



కన్వేయర్ బెల్ట్ పొడిగింపునకు చర్యలు

- 4 రోజుల పాటు సహాయక చర్యలకు ఆటంకం
- ఈ నెల 18 వరకు శిథిలాల తొలగింపు పూర్తి



6

సొరంగంలో చేపట్టిన సహాయక చర్యల్లో వివిధ విభాగాల సిబ్బంది


సద్వినియోగం చేసుకోవాలి

- జూరాల ప్రాజెక్టు నుంచి రెండు రోజులు నీటి విడుదల



జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ (ఫైల్)

అమరచింత, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిని దృష్టిలో ఉంచుకుని కేవలం రెండు రోజులు మాత్రమే సాగునీరు విడుదల చేయనున్నట్లు సోమవారం సీఈ సర్క్యులర్ జారీ చేశారని ప్రాజెక్టు ఈఈ జగన్మోహన్ తెలిపారు. ప్రధాన ఎడమ కాలువ నుంచి 550 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ నుంచి 350 క్యూసెక్కులు మొత్తం 0.2 టీఎంసీల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఆయన తెలిపారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రైతుల ఇబ్బందులను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో మంత్రి ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ నుంచి రెండు రోజులు మాత్రమే నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



భానుడి భగభగ వరణుడి వడగళ్లు

మహబూబ్‌నగర్/నారాయణపేట/రాజాపూర్/వనపర్తిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో అకాలవానలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం వరకు 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో జనం ఉక్కిరిబిక్కిరికాగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఉన్నట్టుండి వాతావరణం చల్లబడింది. జిల్లా కేంద్రంలో అరగంటపాటు మోస్తరు వాన కురిసింది. రైతు మార్కెట్‌లో వడగళ్ల వాన కురిసింది. వర్షంతో పాటు కొద్దిసేపు వడగళ్లు కురవడంతో జనం వాటిని ఆసక్తిగా గమనించారు. పాలమూరులో 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజాపూర్ మండల కేంద్రంలో కూడా వడగళ్ల వాన కురిసింది. దాదాపు 20 నిమిషాల పాటు ఓ మోస్తరు వాన కురిసింది. అయితే మండలాలు గ్రామాల్లో ఎక్కడా వాన కురవకపోవడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. వరి కోతలు సాగుతున్న సమయంలో వర్షం పడితే తీవ్రనష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు, జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజలో గరిష్ఠం 40.1, కనిష్ఠం 26.4 డిగ్రీలు నమోదైంది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో గరిష్ఠంగా 39.7 డిగ్రీలు కనిష్ఠంగా ఖిల్లాఘణపురం మండలంలో 37.7 డిగ్రీలు నమోదైంది.

ప్రారంభమైన 'పది' మూల్యాంకనం

- మొదటి రోజు 7,018 పూర్తి
- మూల్యాంకనాన్ని పరిశీలించిన డీఈవో



జిల్లా కేంద్రంలో పదో తరగతి మూల్యాంకన కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న సిబ్బంది

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల మూల్యాంకన ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన మొత్తం 628 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొంటున్నారు. వీరిలో 384 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 64 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 130 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 50 మంది అదనపు సిబ్బందిని నియమించారు. వీరంతా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,34,461 విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 15లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటి రోజు మొత్తం 7,028 జవాబు పత్రాలను మూల్యాంకనం పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. అందులో తెలుగు 913, హిందీ 1044, ఇంగ్లిష్ 634, గణితం 1043, భౌతికశాస్త్రం 1464, జీవశాస్త్రం 843, సాంఘికశాస్త్రం 1077 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. మూల్యాంకన ప్రక్రియను డీఈవో పర్యవేక్షిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడూ అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 40 జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మూల్యంకనంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, విద్యాశాఖ పర్యవేక్షకులు నాగేందర్, కురుమయ్య, మూల్యాంకన పర్యవేక్షణ అధికారులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విచారణకు ఆదేశాలు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- ఖాళీ స్థలంపై విచారణ చేయాలని కమిషనర్‌ను ఆదేశించిన అదనపు కలెక్టర్

6

వేసవి క్రీడా శిబిరాలు

- కోచ్‌ల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ
- జాతీయ స్థాయి క్రీడాకారులకు అవకాశం
- మే 1 నుంచి ప్రారంభం

యువతకు ఉపాధి

- వనపర్తిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు
- ఎకరా స్థలం, రూ.4.77 కోట్లు కేటాయింపు
- ప్రస్తుతం 172 మంది విద్యార్థులకు నలుగురు అధ్యాపకులతో బోధన
- ప్రాక్టికల్స్ నిర్వహణకు త్వరగా భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్న విద్యార్థులు

6



సలేశ్వరం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

-నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడీ, సంబంధిత శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచు ప్రజల ఆరాధ్య దైవం సలేశ్వరం లింగమయ్య జాతరను ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరపనున్నట్లు తెలిపారు. జాతరకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తులకు కావాల్సిన వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతర రోజుల్లో వైద్యాధికారులు, జిల్లా పంచాయతీశాఖ, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సరైన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట ఆర్డీవో జాతర నోడల్ అధికారిగా ఉంటారని కలెక్టర్ వివరించారు.

వేసవి వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చిన్న పిల్లలు, వృద్ధులు వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై పలు సూచనలు చేశారు. జిల్లాలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లకూడదని పేర్కొన్నారు. ఎండ కారణంగా అస్వస్థతకు గురైన వారు వెంటనే సమీప పీహెచ్‌సీకి వెళ్లి వైద్య సహాయం పొందాలన్నారు. ఉపాధిహామీ క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నీటి చుక్క.. ఒడిసి పట్టాలి పక్కా!

- 'జలనిధి' పేరుతో ఉపాధి హామీ పనులు
- భూగర్భ జలం పెంపే ప్రధాన లక్ష్యం

7



సంకాపూర్‌లో చేపడుతున్న నీటి కుంటల నిర్మాణం పనులు

వనపర్తి ఎద్దులు సత్తా చాటాలి

- బండ లాగుడు పోటీలను ప్రారంభించిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామంలో కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ... గ్రామంలో బండలాగుడు పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ బండలాగుడు పోటీలు జరిగిన వనపర్తి జిల్లాకు సంబంధించిన కోడెలు ప్రతిభ కనబరిచే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ పోటీల్లో పెద్దదగడకు చెదిన గోపాలకృష్ణ ఎద్దులు ప్రథమ బహుమతి రూ.40వేలు సాధించాయి. రాముడు గద్వాల, ఆంజనేయులు గుమ్మడం, బాలరాజు పెబ్బేరుకు చెందిన ముగ్గురి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలవడంతో ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శేఖర్ రెడ్డి, శివన్న, తిరుమలయ్య, గోకం వెంకటయ్య, బుచ్చిబాబు, రమేష్, తిరుమలయ్య, కొండన్న, తదితరులు పాల్గొన్నారు.



పెద్దగూడెం గ్రామంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న శివసేనారెడ్డి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమైన అన్ని ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ యంత్రాలు, యంత్రాలు, టార్పాలిన్‌లు కవర్లు, గన్నీ బ్యాగులు, ధాన్యం శుభ్రం చేసే మిషన్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో దాదాపు 462 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఆత్మకూరు, కొత్తకోట, అమరచింత, మదనాపూర్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాసంగిలో వనపర్తి జిల్లాలో 1,48, 596 ఎకరాల్లో వరి సాగు చేశారని, 4.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ఇందులో స్థానిక అవసరాలు, నేరుగా మిల్లులకు అమ్ముకోవడం వంటివి పోను దాదాపు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారి విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ తదితరులు ఉన్నారు.


వాలీబాల్ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు (ఫైల్)


అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ సునీల్ (ఫైల్)

వేసవి క్రీడా శిబిరాలు

- కోచ్‌ల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ
- జాతీయ స్థాయి క్రీడాకారులకు అవకాశం
- వచ్చే నెల 1 నుంచి వేసవి శిబిరాలు ప్రారంభం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులకు వేసవి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ జాతీయ స్థాయి, సీనియర్ క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవిలో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. సీనియర్ క్రీడాకారులైతే వారి స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 25లోగా జిల్లా క్రీడాశాఖ కార్యాలయం దరఖాస్తు చేసుకోవాలి. వారి అర్హత బట్టి కోచ్‌లను ఎంపిక చేస్తారు.


మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన స్టేడియం

వచ్చే నెల 1 నుంచి శిబిరాలు

వచ్చే నెల 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తారు. దాదాపు 25కుపైగా శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్‌లు శిక్షణ ఇస్తారు. ఒలింపిక్‌లో గుర్తింపు ఉన్న క్రీడల్లో మాత్రమే శిక్షణ ఉంటుంది. అర్బన్‌లో పది శిక్షణ శిబిరాలు ఉంటాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, బాక్సింగ్, చెస్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..



వేసవి శిక్షణ శిబిరాల కోసం జిల్లాలోని జాతీయ స్థాయి, సీనియర్, వ్యాయమ ఉపాధ్యాయులు దర ఖాస్తులు చేసుకోవాలి. మే 1 నుంచి 31 వర కు శిక్షణ ఉంటుంది. ఈ నెల 22 వరకు స్టేడి యం మైదానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎంపికైన కోచ్‌లు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడా అంశాల్లో శిక్షణ ఇస్తారు.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

బాధితురాలికి అండగా నిలవాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్
- ఊర్కొండ పేట గ్రామంలో పర్యటన


ఊర్కొండలో విలేకరులతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు

ఊర్కొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఊర్కొండపేట అత్యాచార ఘటనను మహిళ కమిషన్ సుమోటోగా స్వీకరించి బాధితురాలికి అండగా నిలవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యాచార సంఘటనపై నిజ నిర్ధారణ కోసం పౌర హక్కుల సంఘం రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కమిటీలు నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామంలో పర్యటించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించా రు. గ్రామస్థులు, ఆలయ అధికారులు, భక్తులు, పూజారులతో మాట్లాడి వివరాలు తెలుసుకు న్నారు. స్థానిక ఎస్‌ఐ కృష్ణదేవను కలిసి నింది తుల వివరాలు, గతంలో వారి నేర చరిత్ర తదితర అంశాలను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద రక్షణ చర్యలు లేకపోవడం, పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. భక్తుల రాకపోకలను పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బాధితురాలికి ఎనలేని నష్టం వాటిల్లిందని, ఆమెను, ఆమె కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. అత్యాచార ఘటనపై లోతుగా విచారించాలని, ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడికి లోను కాకుండా సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బాధితురాలికి ప్రజాప్రతినిధులు, మహిళా కమిషన్ అండగా ఉండాలని కోరారు. పౌర హక్కుల సంఘం మహిళా సభ్యులు బాధితురాలిని కలువలేకపోవడంతో పూర్తి వాస్తవాలు బయటికి రావడంలేదని అవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల కమిషన్ కూడా వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కబాలయ్య, నాయకులు పంబలి బాలయ్య, లక్ష్మీనారాయణ, కలకొండ రాములు, వెంకటేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీ రద్దు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరంలో ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి బాలుర క్రికెట్ టోర్నీని రద్దు చేస్తూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో సురేషక దోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి రిటైర్డ్ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలల్లో ఉన్న ఒక పీడీ రిటైర్డ్ కావటంతో ఖాళీ ఏర్పడింది. పీడీలు లేక పోవటంతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నియామకం చేపట్టలేదు.

కబడ్డీ విజేత గుజరాత్

- హోరాహోరీగా మహిళా కబడ్డీ పోటీలు
- అయిజ మండలం మూగోనిపల్లిలో పోటీల నిర్వహణ


జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో మొదటి బహుమతి సాధించిన గుజరాతీ జట్టు

అయిజ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం మూగోనిపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు సోమవారం హోరాహోరిగా సాగాయి. నువ్వా, నేనా అనే రీతిలో గెలుపు కోసం తలపడ్డారు. గుజరాత్, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. మొత్తంగా 12జట్లు ఈ క్రీడా పోటీల్లో తలపడ్డారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన గుజరాత్ జట్టు రూ.40వేల నగదును గెలుపొందింది. రెండో బహుమతి రూ.30వేలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా దక్కించుకుంది. మూడో బహుమతి రూ.20వేలను తమిళనాడు, రూ.10వేలను తిరుపతి జట్లు దక్కించుకున్నాయి. విజేతలకు గ్రామపెద్దల చేతుల మీదుగా నగదు అందజేశారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలం తీగలపల్లికి చెందిన ఓ వివాహిత అదృశ్యం అయ్యిందని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు, కురువమ్మ(25) భార్యా భర్తలు. జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో నివసిస్తున్నారు. రాజు కూలీ పని చేస్తుండగా, కురు వమ్మ కొల్లాపూర్ చౌ రస్తాలోని ఓ హోటల్లో పని చేస్తోంది. ఈనెల 1న బయటకు వెళ్తానని చెప్పి వెళ్లిన కురువమ్మ ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతకు ఉపాధి

- వనపర్తిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు
- ఎకరా స్థలం, రూ.4.77 కోట్లు కేటాయింపు
- ప్రస్తుతం 172 మంది విద్యార్థులకు నలుగురు అధ్యాపకులతో బోధన
- ప్రాక్టికల్స్ నిర్వహణకు భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న విద్యార్థులు


నిర్మాణంలో ఉన్న ప్రాక్టికల్స్ నిర్వహించే భవనం

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేద విద్యార్థులకు టెక్నికల్ రంగంలో నైపుణ్యాల పెంపే లక్ష్యంగా గతంలో పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను ఏర్పాటు చేశారు. నేడు వేగంగా మారుతున్న టెక్నికల్, సాంకేతిక రంగాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే గతేడాది ఆగస్టులో ఏటీసీని ఏర్పాటు చేసేందుకు వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజపేట శివారులో ఐటీఐ కళాశాల సమీపంలో ఎకరా స్థలాన్ని కేటాయించి, రూ.4.77 కోట్ల నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో ఆరు కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఐటీఐ కళాశాల భవనంలోనే ఏటీసీ తరగతులను నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది 172 సీట్లను భర్తీ చేసి వారికి నలుగురు అధ్యాపకు లు బోధిస్తున్నారు. ఏటీసీకి కేటాయించిన ఎకరా స్థలంలో ప్రయోగశాల నిర్మాణ పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయి. భవనం త్వరితగతిన పూర్తి చేసి ప్రాక్టికల్స్ నిర్వహించుకునేందు కుపరికరాలను ఏర్పాటు చేస్తే విద్యా ర్థులకు మరింత ప్రయోజనం ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు.

కోర్సులు	సీట్లు	కాలపరిమితి
ఇండస్ట్రియల్ రొబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్	40	సంవత్సరం
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	40	సంవత్సరం
ఆర్టీసీఎన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్	20	సంవత్సరం
బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్	24	2 సంవత్సరాలు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్	24	2 సంవత్సరాలు
మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికిల్	24	2 సంవత్సరాలు

ప్రాక్టికల్ బిల్డింగ్‌ను త్వరగా పూర్తి చేయాలి



నేను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో ఏడు నెలలుగా ఇండస్ట్రియల్ రొబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ కోర్సును చేస్తున్నాను. మిగ్ విల్డింగ్ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇక్కడ ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న ప్రాక్టికల్‌గా నేర్చుకునేందుకు బిల్డింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రాక్టికల్ కోసం నిర్మితమవుతున్న బిల్డింగ్ త్వరగా పూర్తి చేయించాలి.

- అక్షయ్, కొత్తకోట

నూతన నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం..



యువత ఇండస్ట్రీయల్‌లో పని చేయడానికి కంప్యూటర్ సాఫ్ట్, న్యూమరికల్ లాంటి అనేక నైపుణ్యాలను యువతకు నేర్పిస్తున్నాం. రాబోయే రోజుల్లో పెరిగే టెక్నాలజీని దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగా యువతను తీర్చిదిద్దుతున్నాం. కంపెనీలు ఏటీసీ సెంటర్లకు వచ్చి తమకు కావాల్సిన యువతను రిక్రూట్‌మెంట్ చేసుకుంటాయి.

- భాస్కర్, టీటీఎల్ ఇన్‌స్పెక్టర్

ఉన్నతమైన ఉద్యోగం సాధించాలనేది లక్ష్యం



మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్ కోర్సు చేస్తున్నాను. ఎలక్ట్రానిక్ వెహికిల్స్‌ను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా రక్షించుకోవచ్చు అని తెలుసుకున్నాను. ఎలక్ట్రానిక్ వెహికిల్ రంగంలో మంచి ఉద్యోగంలో స్థిరపడాలనే లక్ష్యంతో నేర్చుకుంటున్నాను. ప్రాక్టికల్ చేసేందుకు బిల్డింగ్ పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- అక్షయశ్రీ, కడుకుంట్ల

ఖాళీ స్థలాలపై విచారణకు ఆదేశాలు

- కమిషనర్‌ను ఆదేశించిన అదనపు కలెక్టర్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో కబ్జాకు గురైన ఖాళీస్థలంపై పూర్తిస్థాయిలో విచా రించాలని, ఆ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు సోమవారం మునిసిపల్ కమిషనర్ దశరథ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 6న ఆదివారం ఖాళీగా ఉంటే కబ్జా.. శీర్షికన కథనంవెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి ముగిసిన వెంటనే మునిసిపల్ కమిషనర్‌కు ఈ స్థలంపై పూర్తి వివరాలను సేకరించాలని, అక్కడి గుడిసెకు సంబంధించి ఇంటి నెంబర్ పరిశీలించాలని, ఆ నెంబర్‌ను మునిసిపల్ కార్యాలయంలో ఏ అధికారి ఇచ్చారనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. ఆ స్థలం మునిసిపాలిటీదా, హౌసింగ్ బోర్డు పరిధిలోనిదా అని తేల్చాలని, త్వరగా నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లను భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం 1962 నుంచి ఎన్ని చట్టాలు, జీవోలు వచ్చినా అమలు కాలేదన్నారు. బీహార్‌లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచితే, ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. దేశంలో మేధావులంతా అగ్ర కులానికి చెందిన వారే ఉండడంతో కింద వర్గాలను పీడిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి, నిబద్ధతను నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పిడికిళ్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అరవిందాచారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వంగూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని జాజాల గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాజాల మాజీ సర్పంచ్ బాలస్వామిగౌడ్ ద్విచక్ర వాహనంపై అన్నారం గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నది. ప్రమాదంలో బాలస్వామిగౌడ్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థాని కులు అతడిని 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వెల్దండలోని యెన్నం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహేందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జాతరవేళ విషాదం

- కాలువలో కొట్టుకుపోయిన చిన్నారులు
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


కాలువలో కొట్టుకుపోయిన అంజలి(ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సంబరంగా గడపాలని జాతరకు వచ్చిన ఆ రెండు కుటుంబాల్లో విషాదం మిగిలింది. రాయచూరు జిల్లా ఇడపనూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయచూరు తాలూకాలోని గాణదాళ పంచముఖి ఆంజనేయ స్వామి జాతరకు ఆ రెంటు కుటుంబాలు పిల్లలతో సహా వచ్చారు. కుటుంబ సభ్యులందరూ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఆ బాలిక, బాలుడిద్దరూ సమీపంలోని కాలువ వద్దకు వెళ్లి స్నానం చేసే ప్రయత్నం చేశారు. అయితే నీటి ఉధృతి కారణంగా వాళ్లు కొట్టుకుపోయారు. బాలికను తెలంగాణ రాష్ట్రం గద్వాల ప్రాంతానికి చెందిన అంజలి(17)గా, బాలుడిని ఏపీ రాష్ట్రం ఎమ్మిగనూరుకు చెందిన రఘు(14)గా గుర్తించారు. తల్లిదండ్రులు చూస్తుండగానే వీరిద్దరూ నీళ్లల్లో మునిగి కొట్టుకుపోయారు. పిల్లలను కాపాడలేక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న కారణంగా ఎవ్వరూ కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. సంఘటన సంబంధించి ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కన్వేయర్ బెల్ట్ పొడిగింపునకు చర్యలు

- 4 రోజుల పాటు సహాయక చర్యలకు ఆటంకం
- ఈ నెల 18 వరకు శిథిలాల తొలగింపు


టన్నెల్‌లో ఉబికి వస్తున్న నీరు

దోమలపెంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో (టన్నెల్) ప్రమాద ఘటన జరిగి సోమవారానికి 45 రోజులు గడిచింది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి రెస్క్యూ బృందాల అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడవు వరకు శిథిలాల తొలగింపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెస్క్యూ బృందం అధికారులను ఆదేశించారు. సహాయక చర్యల్లో ఆర్మీ అధికారులు, సింగరేణి మైన్స్ రెస్క్యూ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే అధికారి రవీంద్రనాథ్, జీఎస్‌ఐ, ఇరిగేషన్, జెపీ కంపెనీ ప్రాజెక్టు సీనియర్ ఇంజనీర్ సంజయ్ కుమార్ సింగ్ వివిధ శాఖల అధికారులు పాల్గొంటున్నారు.

8 నుంచి 11వ తేదీ వరకు...

ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్న 13.730 కిలోమీటర్ల నుంచి 13.800 కిలో మిటర్ వరకు కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించనున్నట్లు రెస్క్యూ బృందం అధికారులు చెప్తున్నారు. ఈ పనులు 8 నుంచి 11వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు బురద, మట్టిని బయటకు తరలించడం సాధ్యం కాదని తెలిపారు. బండరాళ్లు, కత్తిరించిన ఇనుప శకలాలను బయటకు తరలిస్తూ కన్వేయర్ బెల్ట్ పొడిగింపు పనులను కొనసాగించనున్నారు. కన్వేయర్‌ను బెల్ట్ పొడిగింపు ఇదే చివరి సారని, మిగిలిన 70 మీటర్ల వరకు ఉన్న శిథిలాలను పూర్తిగా తొలగిస్తామని రెస్క్యూ బృందాల సభ్యులు చెప్తున్నారు. 13.936 కిలోమీటర్ల అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా పరిగణించి, 43 మీటర్ల వరకు కంచె నిర్మించారు. అక్కడ తవ్వకాలు జరిపే పరిస్థితులు లేవని అధికారులు చెప్తున్నారు.

క్రైం కార్నర్

లారీ పై నుంచి జారిపడి డ్రైవర్ మృతి

మానవపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీపై నుంచి జారిపడిన లారీడ్రైవర్ మృతిచెందాడని ఎస్‌ఐ చంద్రకాంత్ సోమవారం తెలిపారు. ఆ వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్టానికి చెందిన ఎండీ ఇమ్రాన్ (24) ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూరుకు లారీలో గోధుమల లోడ్‌తో వెళ్తున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని 44వ జాతీయ రహదారి జల్లాపురం శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద లారీకి సంబంధించిన పత్రాలు చూపి, తిరిగి వచ్చి లారీ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. కర్నూల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బాబాయ్ ఇక్బాల్‌అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

వీపనగండ్ల, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బొలెరో డ్రైవర్ రాఘవేందర్(39) చికిత్స పొందుతూ... సోమవారం మృతిచెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోవర్ధనగిరికి చెందిన రాఘవేందర్ శనివారం మామిడి కాయల లోడుతో హైదరాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆదివారం హైదరాబాద్ రింగ్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కోస్గి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కూతురు మాట వినడం లేదని మనస్తాపానికి గురైన తండ్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం స్థానిక ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పేట జిల్లా కోస్గి మండలం బిజ్జారం గ్రామానికి చెందిన కుర్వ మల్లప్ప(45) కొన్ని రోజుల నుంచి తన కూతురు మాట వినటం లేదని మనస్తాపానికి గురై గతనెల 31న తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బాధితుడి తల్లి మరికొందరి సాయంతో మల్లప్పను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లప్ప ఆదివారం రాత్రి మృతి చెందాడు. తల్లి కుర్వ బసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాయనమ్మ సంరక్షణ విషయంలో గొడవ

▸▸ అన్న కుమారుడిపై బాబాయిల దాడి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన బురగల్ల శివపై తన బాబాయిలు కృష్ణయ్య, రాములు, శివుడు కలిసి కర్రతో దాడి చేసి గాయపరిచారని సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బురగల్ల శివ తండ్రి ఇంతకు ముందే మృతిచెందాడు. దీంతో నానమ్మ అంజలమ్మ తన బాబాయిలు వంతుల వారీగా సంరక్షిస్తున్నారు. ఈ విషయంలో ఈ నెల ఆరో తేదీన శివపై బాబాయిలు దాడి చేశారు. పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామనే తరుణంలో అదే రోజు రాత్రి ముగ్గురు బాబాయిల భార్యలు శ్యామలమ్మ, అలివేలు, విజయలక్ష్మి ఫిర్యాదుదారుడి ఇంటిపైకి వెళ్లి కట్టెతో కొట్టి గాయపరిచారు. దీంతో శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు.

42 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్



మామిడిమాడలో ఇసుక డంపును సీజ్ చేస్తున్న తహసీల్దార్ సుగుణ

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిమాడలో అక్రమంగా నిల్వ చేసిన 42 ట్రాక్టర్ల ఇసుక డంపును సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. గ్రామంలో క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక డంపు చేసినట్లు గుర్తించామన్నారు. మామిడిమాడలో ఫిల్టర్ ఇసుక తయారు చేయడానికి నేరేడు చెరువులో తవ్విన గోతులను పరిశీలించారు. అక్రమంగా ఇసుకను నిల్వ చేయడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ తిరుపతయ్య, సర్వేయర్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి నవీన్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

హన్వాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఇదాయత్‌అలీ తెలిపారు. సోమవారం కోయిల్‌కొండ మండలం సురారం నుంచి వెంకటపూర్ చెందిన టిప్పర్ ఇసుకను తరలిస్తుండగా పెద్దదర్పల్లి సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని కావేరమ్మపేట సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రాజీవ్‌నగర్‌కాలనీలో సోని (40) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన సోనీ, తన సోదరుడితో గొడవ పడి మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సోని భార్య రోజమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, అచ్చంపేట మండల పరిధిలోని పల్కపల్లి గ్రామ రైతు వేదిక సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమయినట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. గుర్తు తెలియని పురుషుడి మృతదేహం (45) ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చరికి తరలించామన్నారు. ఎవరికైనా ఆనవాళ్లు తెలిస్తే అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కుక్కల దాడిలో 23 మేక పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

తెలకపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లిలో కుక్కల దాడిలో 23 మేక పిల్లలు మృతి చెందాయి. సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కొట్టె రామచంద్రయ్య తన పొలంలో ఉంచిన మేక పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. వీటి ఖరీదు రూ. 2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.



మేడికొండలో పంట పొలంలో పూర్తయిన గల్లీ కంట్రోల్



చిన్నతాండ్రపాడు రైతు పొలంలోని నీటి కుంటలో నిల్వ ఉన్న నీరు.



నారోజి క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

ప్రతీ నీటి చుక్క.. ఒడిసి పట్టాలి పక్కా!

▸▸ 'జలనిధి' పేరుతో ఉపాధి హామీ పనులు

▸▸ భూగర్భ జలం పెంపే ప్రధాన లక్ష్యం



అయిజ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నీటి చుక్కను ఒడిసి పట్టి నిల్వ చేయడం, నీటి వృథా ను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. రోజురోజుకూ జనాభా పెరుగుతుండటంతో ఆ మేరకు నీటి వినియోగం పెరుగుతూనే ఉంది. దీంతో పాటు నీటి వృథా కూడా ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో జల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'జలనిధి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఉన్న నీటి వనరులను కాపాడుకోవడం, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని, భూమిలో ఇంకేలా చేయడం తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా చేయాల్సిన పనులను గుర్తించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసింది.

చేపట్టాల్సిన పనుల గుర్తింపు

కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా జలవనరుల పరిరక్షణ, జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను నిర్దేశించారు. సంబంధిత అధికారులు వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గత ఏడాది డిసెంబర్‌లోనే ఊరూరా గ్రామ సభలు నిర్వహించి పనులను గుర్తించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 1,55,000 జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 3.32 లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వారందరూ ఈ పనుల్లో పాల్గొనున్నారు. ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన పనులను అదే ఏడాది పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో పనులను చేపట్టి, సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు.



వర్షాకాలం నాటికి లక్ష్యం పూర్తి

నిర్దేశించిన పనులు వర్షాకాలం నాటికి పూర్తయితే ఆశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం. అనుకున్న రీతిలో పనులు పూర్తయితే భూగర్భజలం పెంపొందు తుంది. జలనిధి పథకం కింద జిల్లాలో చేపట్టాల్సిన పనులను గుర్తించాం. ప్రస్తుతం పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. నీటి వృథా ను అరికట్టే ందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

- నర్సింగరావు, డీఆర్‌డీఏ

జలనిధి' కింద చేపట్టాల్సిన పనులు

'జలనిధి' కార్యక్రమం కింద చేపట్టాల్సిన పనులను కేంద్రం గుర్తించి, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసింది. వర్షం నీటిని ఒడిసి పట్టుకునేందుకు రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు (ఇంటి పైభాగంలో కురిసిన వర్షం నీటిని భూమిలోకి ఇంకేలా నిర్మాణాలు) ఏర్పాటు చేయడం, ఖాళీ స్థలాలు, పంట పొలాల చుట్టూ కందకాలు తవ్వడం, గల్లీ కంట్రోల్‌లు నిర్మించడం, వాగులు, వంకలపై చెక్‌డ్యాంల నిర్మాణం, అనువైన ప్రాంతాల్లో చిన్న కుంటలను నిర్మించడం, వాగులు, వంకల్లో నీటి నిల్వ, పొలాల్లో నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. అలాగే సింగిల్ ఫేజ్ మోటర్లు, చేతి పంపుల వద్ద, ఇళ్ల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి సారించాలి. ఆ దిశగా అధికారులు పూర్తి స్థాయి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీ గ్రామ పంచాయతీలో మూడు నుంచి ఐదు వరకు నిర్మాణ పనులను చేపట్టారు. మేడికొండ, సంకాపూర్ గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం జరిగింది. సంకాపూర్, చిన్నతాండ్రపాడు గ్రామాల్లో నీటి కుంటల ఏర్పాటు పూర్తయ్యింది. మేడికొండ పంట పొలాల్లో గల్లీ కంట్రోళ్లు పూర్తి చేశారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన ధన్వాడ

▸▸ ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం

▸▸ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఉత్సవ విగ్రహాలను రథం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ధన్వాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి రథోత్సవంలో ఏర్పాటు చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య రథోత్సవం నిర్వహించారు. రథానికి పూలు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. రథోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగస్థల నటుడు ఏ.శ్రీశైలం లంకేశ్వరు ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మరో రంగస్థల నటుడు మొల్కోమోల్ల బాలకృష్ణ పరుశురాం ఏకపాత్రాభినయం చేశారు. ప్రేక్షకుల చప్పట్లు, కేరింతల మధ్య ఏకపాత్రాభినయం కొనసాగింది. అనంతరం శ్రీశైలం, బాలకృష్ణలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భజన కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సుంకు నర్సిములు, చాకలి బాలయ్య, ఉపాధ్యాయులు అశ్విని నర్సిములు, కెంచె రంగయ్య, రిటైర్డ్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఎం.సత్యనారయణ, కెంచె నారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, సిరం లక్ష్మన్న, బుదరపు సత్యయ్య, కెంచె జయప్రకాష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



ఉట్లు కొడుతున్న యువకులు



ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు

కృష్ణ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం కున్సీ గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో కోనేరు పరిసరాలను పరిశీలించి, మాట్లాడారు. రాబోయే రోజుల్లో వేణుగోపాలస్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో పాల ఉట్లు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనసూయమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడి సన్నిధిలో సీతా దయాకర్‌రెడ్డి



ఉమామహేశ్వరాలయంలో పూజలు చేస్తున్న సీతా దయాకర్‌రెడ్డి

దోమలపెంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలానికి ఉత్తర ద్వారం, ఉమామహేశ్వరంలో కొలువు దీరిన స్వామిని సోమవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమె తొలి సారి ఉమామహేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ప్రమదమ్మ పాల్గొన్నారు.

సీసీరోడ్ల నాణ్యతపై విచారణ చేపట్టాలి

▸▸ ప్రజావాణిలో గద్వాల కలెక్టర్‌కు ఆయాగ్రామాల ప్రజల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

గట్టు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణాన్ని నాణ్యత లేకుండా చేపడుతున్నారని, వెంటనే విచారణ చేపట్టాలని జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని పలుగ్రామాల ప్రజలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గట్టు మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.4.40 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారని తెలిపారు. ఇందువాసి, చాగదోణ, మాచర్ల, బోయలగుడ్డం, అంతంపల్లి, ముచ్చోనిపల్లి, మల్లంపల్లి, రాయపురం, గోర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో చేపట్టిన పనుల్లో నాణ్యతలేని ఇసుక, సిమెంటు, కంకరను వాడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక కూలీలను ఉపయోగించకుండా మిషన్‌లతో పనులు చేపడుతూ, కూలీల కడుపు కొడుతున్నారని, ఈ విషయాన్ని స్థానిక ఇంజనీర్‌ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు, గ్రామాల్లోని మాజీ పాలకులు ఇష్టారాజ్యంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, తక్కువ సైజులో రోడ్లు వేస్తూ బిల్లులు పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. త్వరగా విజిలెన్స్ విచారణ చేయించాలని అంతంపల్లి ఆంజనేయులు, వీరశేఖర్‌గౌడ్, కే.వీరేశ్, రాముడు, రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు.

పీయూ రిజిస్ట్రార్‌గా రమేశ్‌బాబు



రమేశ్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వీసీ శ్రీనివాస్, పీయూ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా రమేశ్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా పనిచేసిన చెన్నప్ప వ్యక్తిగత పనులతో రాజీనామా చేశారు. దీంతో ఓయూ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు నియమితులయ్యారు. సికింద్రాబాద్‌కు చెందిన ఈయన ఓయూలో ఐదేళ్లకు పైగా అన్ని విభాగాల పరీక్షల నిర్వహణ అధికారిగా, సెట్ పరీక్షల కన్వీనర్‌గా పనిచేశారు. ప్రధానంగా అన్ని విభాగాల సెట్ పరీక్షలను, కౌన్సిలింగ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి సులభంగా, వేగంగా విధానాన్ని అమలు చేసి గుర్తింపును తెచ్చుకొన్నారు. కాగా వీసీ జీఎన్ శ్రీనివాస్ పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదుసూధన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి రాజ్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ రవికాంత్ పాల్గొన్నారు.

హత్య కేసులో నేరస్థుడికి యావజ్జీవం

▸▸ రూ.5 వేల జరిమానా

మద్దూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరస్థుడికి యావజ్జీవంతో పాటు, రూ.5 వేల జరిమానా విధిస్తూ నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్‌రఫీ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ సోమవారం వెల్లడించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. మద్దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవింద్ మొదటి భార్య మృతి చెందడంతో వెంకటమ్మను రెండవ వివాహం చేసుకున్నాడు. మొద టి భార్యకు ఇద్దరు ఆడ పిల్లలు ఉండగా, వీరిలో పెద్ద కూతురు వివాహం జరగ గా రెండవ కూతురు కృష్ణవేణి దివ్యాంగురాలు కావడంతో వివాహం కాలేదు. గో విండ్ భార్య వెంకటమ్మ చిన్న కూతురు కృష్ణవేణితో కలిసి 12 ఏళ్లుగా హైదరా బాద్‌లో కూలీ పని చేసుకుంటు అక్కడే ఉంటున్నారు. 2002 ఫిబ్రవరి 13న తల్లీ కూతుళ్లిద్దరు పని నిమిత్తం బయటకు వెళ్లగా అక్కడే పనిచేస్తున్న వెంకటయ్య (వెంకట్రాములు) కృష్ణవేణికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని తల్లిదండ్రులు ఫిబ్రవరి 15న రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అదేనెల 18న మద్దూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో తమ కూతురు కృష్ణవేణి కాలిన గాయాలతో ఉందని తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన మద్దూర్‌కు చేరుకొని చికిత్స నిమిత్తం నారాయణపేట, అటు నుంచి మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తల్లిదండ్రులు కూతురు కృష్ణవేణిని అడగగా వెంకట్రాములు అనే వ్యక్తి తనను ఆసుపత్రి సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేయడంతో నిరాకరించిన తనపై పెట్రోల్ పోసి తగిలించాడని తెలిపి అదే ఏడాది ఫిబ్రవరి 19న మృతి చెందింది. తమ కూతురు మృతికి కారణమైన వెంకట్రాములుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణవేణి తల్లిదండ్రులు మద్దూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ జనార్థన్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటును సమర్పించారు. ఈ క్రమంలో ప్రస్తుత డీఎస్పీ లింగయ్య సూచన మేరకు సీఐ సైదులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌లు ఆదేశం మేరకు సిబ్బంది కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టారు. పీపీ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో నేరస్తుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.5 వేల జరిమాన విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ వెల్లడించారు. నేరస్తుడికి శిక్ష పడడానికి కృషి చేసిన పీపీ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

ఇంటర్వ్యూ

75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు

- పశువైద్యాధికారి, ఆంజనేయులు



రేవల్లి ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు ఎస్.ఎస్.జి అందుబాటులో ఉన్నాయని అతి త్వరలో గడ్డి కత్తిరించే యంత్రాలు కూడా సబ్సిడీతో అందుబాటులోకి వస్తాయని సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పశువైద్యాధికారి ఆంజనేయులు పలు విషయాలు వెల్లడించారు.

మన ప్రాంతంలో పశువులకు అధికంగా వచ్చే వ్యాధులు ఏవీ?

ఎక్కువగా గాలికుంటూ, జబ్బు వ్యాపు, గురక రోగం వంటి వ్యాధులు వస్తాయి.

వ్యాధి నివారణకు చేపట్టే చర్యలేవీ?

గాలికుంటు వ్యాధికి సంవత్సరానికి రెండు సార్లు, గురుక, జబ్బు వాపు వ్యాధులకు సంవత్సరంలో ఒకసారి ఉచిత టీకాల కార్యక్రమం పశువైద్య బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నాం.

ఏయే గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరం క్యాంపులు ఏర్పాటు చేశారు?

తలుపునూరు, కేశంపేట గ్రామాల్లో పశుగర్భ కోశ వ్యాధుల నివారణ క్యాంపులు ఏర్పాటు చేసి నివారణ చర్యలు చేపట్టాం.

విపత్తుతో పశువులు చనిపోతే నష్టపరిహారం ఏమైనా వస్తుందా?

వరదలు, ఉరుములతో పశువులు చనిపోతే సంబంధిత శాఖల వద్దకు వివరాలు అందజేస్తాం. వచ్చే అవకాశం ఉంది.

పశువుల పెంపకానికి ఏదైనా సబ్సిడీ ఉందా?

గొర్రెలు, కోళ్ల పశుగ్రాసం పందుల పెంపకానికి 50 శాతం సబ్సిడీతో ఎంఎల్ఎం ప్రాజెక్టు అందుబాటులో ఉంది.

గొర్రెల పంపిణీ పథకంలో డీడీ కట్టిన వారందరికి డబ్బులు తిరిగి అందజేశారా?

డీడీలు కట్టిన వారందరికి డబ్బులను తిరిగి వారి అకౌంట్‌లో జమ చేశాం.

న్యూస్ బాక్స్

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ శశిధర్

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసానికి పట్టణ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు. సోమవారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆయా వార్డుల నుంచి యువతీ యువకులు చేసుకున్న దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ నెల 14వ తేదీన గడువు ముగియనుందని చెప్పారు. పట్టణ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పావని, లబ్ధిదారులు పాల్గొన్నారు.


పవన్ కుమార్‌కు సన్మానం



పవన్ కుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కొత్తకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెవాటకి చెందిన మండ్ల పవన్ కుమార్ ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన గ్రూప్ వన్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సన్‌రైజ్ వాకింగ్ గ్రూప్ సభ్యులు ఇంటికెళ్లి పవన్ కుమార్‌తో పాటు తల్లిదండ్రులు పుష్పలత, వెంకటస్వామి (హెడ్ కానిస్టేబుల్)లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, టీచర్ వెంకటయ్య, న్యాయవాది రాములు యాదవ్, శ్రీనివాసులు, సురేష్, భాస్కర్, మురళీ, వినోద్ సాగర్, సంతోష్ కుమార్, అరుణ్‌సాగర్, కిషోర్ కుమార్, రంజిత్‌రెడ్డి, తిరుపతయ్య, శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

ఐజీ రమేశ్ రెడ్డికి సన్మానం



రమేశ్ రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

అమరచింత, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నందిమల్ల శివారులోని ప్రధాన ఎడమ కాలువ పక్కన పోలీస్ అవుట్ పోస్టు మంజూరుకు కృషి చేసినందుకు సోమవారం నందిమల్ల గ్రామస్థులు ఐజీ రమేశ్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మన్నీపురంలోని ఐజీ స్వగృహంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు. ఐజీని సన్మానించిన వారిలో చంద్రశేఖర్ రెడ్డి, సత్యారెడ్డి, కందూరు భాస్కర్, యుగంధర్, కుమార్ ఉన్నారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తాం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సోమవారం పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వరి పైరును కోసిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యాన్ని కవర్లలో ఆరబెట్టాలని సూచించారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కొత్తగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడంతో లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తున్నట్లు విద్యుత్ ఏఈ కొండయ్య తెలిపారు. మండలంలోని ఉప్పరిపల్లిలో 2, సోలీపూర్1, ఖిల్లాఘణపూర్ 1, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. వేసవి కాలంలో గృహ వినియోగదారులు విద్యుత్‌ను అధికంగా వినియోగించుకునే అవకాశం ఉందని, ముందస్తుగా విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి లో వోల్టేజీ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడడంతో కరెంటు ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుర్తు చేశారు. విద్యుత్ వినియోగదారుల సంఖ్యను బట్టి విద్యుత్ లైన్‌ల విస్తరణ జరుగుతుందని అన్నారు. విద్యుత్ సరఫరాల్లో అంతరాయాలు తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను పెంచుతామని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రజలు చెత్తాచెదారం వేయరాదని సూచించారు. మండల కేంద్రంలో మరో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి మంజూరు వచ్చిన స్థలాలు ఇవ్వకపోవడంతో బిగించలేకపోతున్నామని అన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో విద్యుత్ వినియోగానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రయత్నించిన ప్లాట్ యజమానులు స్థలం ఇవ్వకపోవడంతో సబ్ స్టేషన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచినట్లు తెలిపారు. గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారని తెలియజేశారు. లైన్‌మన్ సురేష్, విద్యుత్ సిబ్బంది యాదిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పరిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఖిల్లా ఘణ పురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుకాడిపల్లి, అంజనగిరి క్షేత్రంలో శ్రీలక్ష్మి అలర్మేల్ మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో 7వ తేదీని పురస్కరించుకుని సోమవారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజారులు భక్తులకు ప్రత్యేకంగా అర్చనలు చేస్తు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజన మండలి సభ్యులు వెంకటేశ్వర స్వామి కీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహించి గోవింద నామస్మరణ మార్మోగించి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం భక్తులకు అల్పాహారం ప్రసాదం వితరణ చేసిన పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన విట్ట సోని, అనూష రెడ్డి లను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.



గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

వైభవంగా చక్రస్నానం

వనపర్తి రూరల్ : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న కోదండ రామస్వామి ఉత్సవాలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉత్సవాలు అనంతరం సీతారాముల విగ్రహాలకు ఆలయ పూజారి భక్తులతో కలిసి చక్రస్నానం చేయించారు. ఆరు రోజులు జరిగిన పూజా కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు ఇతర ప్రదేశాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.



చక్రస్నానం చేయిస్తున్న పూజారి రమణ

'అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా'

వనపర్తి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మీ ఇంటి బిడ్డగా పనిచేసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. త్వరలోనే నియోజకర్గంలో రూ.985 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 15 నెలల్లో రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులు చేశానని, మరో రూ.1000 కో ట్ల అభివృద్ధి పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 207 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, అదే విధంగా 791 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హక్కుల సాధనకు పోరాటం'

కొత్తకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హక్కుల సాధనకు ప్రజలతో కలిసి దేశ, రాష్ట్రాన్ని విడతల వారీగా దిగ్బంధం చేస్తామని బీసీఎఫ్ (వెనుకబడిన కులాల ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు అన్నారు. సోమవారం కొత్తకోటలో బీసీఎఫ్, ఆర్ఎంఎఫ్ (రిలీజియస్ మైనార్టీ ఫెడరేషన్) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నరాములు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్, రాష్ట్రం ప్రభుత్వ జీవో నంబర్ 28ను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ రెంటింటి ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఆదివాసి, మైనార్టీ, అగ్రకుల పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీసీఎఫ్, ఆర్ఎంఎఫ్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. అనంతర ఆర్ఎంఎఫ్ మండల అధ్యక్షుడిగా షేక్ మైనొద్దీన్, మండల ప్రధాన కార్యదర్శిగా సహంగీర్, యువసేన పట్టణ అధ్యక్షుడిగా ముషారఫ్ నియమించారు. మహబూబ్‌నగర్ బీసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, రామన్‌గౌడ్, కృష్ణయ్య, గంగాధర్, వెంకటేష్ యాదవ్ ఆర్ఎంఎఫ్ నాయకులు ఖదీర్ పాష, మహమ్మద్ పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతీ నిరుపేద కుటుంబ గడపకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో 105 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు కార్పొరేట్ హాస్పిటల్‌లో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తుందన్నారు. ఆపదలో ఉన్న వారికి తోడుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజేంద్రప్రసాద్, రవి, యాదయ్య, కమ్మర్ మియా, ఎండీ బాబా, నారాయణ, రాగివేణు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా నేడు నిరసన



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా మంగళవారంజిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి రాజన్న మాట్లాడారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ భావాజాలాలను ప్రజలపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానం అవలంభిస్తూ.. రైతాంగాన్ని మోసం చేస్తూ మోదీ పాలన కొనసాగుతుందని విమర్శించారు. కార్యక్రమంలో సి.రాజు, సామ్యూల్, కురుమన్న, మసలమని, ప్రేమరత్నం, భక్తి, ఆనంద్, జిలాని విజయ్, ఏసన్న పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్లు అందజేత

పెద్దమందడి, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి) : క్లాస్‌మేట్ క్లబ్ వనపర్తి జిల్లా శాఖ తరఫున ఖిల్లాఘనపురం మండల విద్యాధికారి జయశంకర్, క్లబ్ సభ్యులు రాఘవేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత, పెద్దమందడి మండల విద్యాధికారి బాణం విష్ణు సమక్షంలో 6, 7 తరగతుల విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాన్‌గల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన లక్ష్యమని గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దొండాయపల్లి, కొత్తపేట గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ చేసి మాట్లాడారు. రవి, వెంకటేష్ నాయుడు, తిరుపతయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

రేవల్లి : మండలంలోని తలుపునూరు, నాగపూర్ గ్రామాల్లోని రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులకు సోమవారం తహసీల్దార్ లక్ష్మిదేవి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఆర్ఐ శంకర్, గ్రామ కార్యదర్శి రమేష్, రేషన్ షాప్ డీలర్లు కృష్ణారెడ్డి, నరసింహ, బాలపీరు, కృష్ణ, బాలరాజు, కృష్ణయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

వీపనగండ్ల : మండల కేంద్రంతో పాటు కల్వరాలలో సోమవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ వరలక్ష్మి ప్రారంభించారు. కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, బీరయ్య, ఎత్తం కృష్ణయ్య, బాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్, రఘునాథ్‌రెడ్డి, చక్ర వెంకటేష్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట ఎమ్మెల్యేకు పరామర్శ

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకొని, మళ్లీ ప్రజల్లోకి త్వరగా రావాలని వారు ఆకాంక్షించారు.

ప్రతీ లబ్ధిదారుడు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి

పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీవో రవీంద్ర లబ్ధిదారులకు సూచించారు. సోమవారం మండలంలోని ఈర్లదిన్నెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇల్లు లేని పేదల కోసం ఇళ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతీ లబ్ధిదారుడు ఇంటిని నిర్మించుకోవాలన్నారు పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి ఉన్నారు.

'ఆరోగ్యానికి మించిన సంపద లేదు'

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యో) : మనిషి జీవన విధానంలో ఎంత సంపాదించినా.. ఆరోగ్యానికి మించిన సంపాదన లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు, గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరు వ్యాయమం, యోగ, ప్రాణాయమం, అరగంట పాటు నడక సాగించాలన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జాన్సీరాణి, డాక్టర్ మంజుల, డాక్టర్ నదియా సాదత్, రెడ్ క్రాస్ సభ్యులు కలాం పాషా, అహ్మద్, రాజేందర్‌కువర్, నర్సింగరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు..

వీపనగండ్ల, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని మండల విద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించారు. వైద్య సిబ్బంది కేశవులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన సభ

పాన్‌గల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : 2025 గురుకుల విద్యార్థుల పరీక్ష ఫలితాల్లో వెంగళాయపల్లి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. సాయి ప్రణీత, రక్షిత, దివ్యశ్రీ పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు గతంలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన వెంకటేశ్, ఉపాధ్యాయురాలు రాణిలను ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాసీం సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయుడు రాందాస్, నరసింహరావు, సంతోష్ మూర్తి, గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, సంజీవ రెడ్డి, కొండలయ్య, లక్ష్మణ్, నాగేష్, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

రేషన్ షాపులను తనిఖీ చేయాలి

జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీపై పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా దొడ్డు బియ్యం, సన్న బియ్యం కలిపి పంపిణీ చేయవద్దని సూచించారు. అలాంటి పనులు ఎక్కడైనా చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సదరు రేషన్ షాపు డీలర్ లైసెన్స్ క్యాన్సల్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మరికొద్ది రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభం కాబోతుందని, ఆ కొనుగోలు కేంద్రాలను కూడా తహసీల్దార్లు సందర్శించి పర్యవేక్షణ ఉంచాలన్నారు.

భూమి ఆక్రమణపై ఫిర్యాదు

అమరచింత : పట్టణంలోని నాగుల కుంట వద్ద భూమి ఆక్రమణ చేసి సాగు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ కాలనీకి చెందిన రామచందర్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రేషన్ షాపుల్లో ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : చౌకధర దుకాణాల్లో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆత్మకూరు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆత్మకూరు బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్, ఆంజనేయులు, మనోహర్ గౌడ్, లక్ష్మీకాంత్, రాములు, వెంకటేష్, మహేశ్వర్ , మాసన్న తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ చిన్నారుల్లో కంటి, మానసిక సమస్యలను గుర్తించేందుకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిస్సార్ అహ్మద్ తెలిపారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని 10వ వార్డులోని అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక స్థాయి నుంచి చిన్నారులను బలోపేతం చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, గుడ్డు, పాలు వంటి పోషకాలను అందజేస్తుందన్నారు. సూపర్‌వైజర్ శ్రీలత, రఘునందన్, రాణి పాల్గొన్నారు.



చిన్నారులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

వ్యక్తి కిడ్నాప్ కేసులో నలుగురి అరెస్టు

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కిడ్నాప్ కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌లు తెలిపారు. తన భర్త వెంకటేష్ కనిపించడం లేదని భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెంకటేష్ తల్లి మధ్యవర్తిగా ఉండి... నాలుగు సంవత్సరాల కిందట ఎరుకలి చంద్రకళకు లక్షన్నర డబ్బు ఇప్పించింది. చంద్రకళ అప్పు చెల్లించకపోవడంతో మీ అమ్మే మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించిందని, దీంతో ఆ డబ్బులు నీవే చెల్లించాలని ఎరుకలి గంగన్న, జగన్నాథం, దాసరి మహేందర్, కండెల పోషయ్యలు వెంకటేష్‌ను భయపెట్టి కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. సోమవారం ఆత్మకూరు మండల పరిధిలోని పిన్నంచర్లలో వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఆ వాహనం అదే సమయంలో అక్కడి నుంచి వెళ్తూ.. పోలీసులను చూసి కారును కొంత దూరంలో నిలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు దగ్గరకు వెళ్లి చూస్తుండగానే వారు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు పట్టుకుని విచారించగా.. వెంకటేష్‌ను కిడ్నాప్ చేసింది మేమే అని ఒప్పుకున్నారు. దీంతో వారిని కోర్టులో హాజరు పరచగా.. వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో రైతులకు లబ్ధి



మూలమల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోనే కాంగ్రెస్ పార్టీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులకు లబ్ధి చేకూరనుందని కిసాన్ సెల్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మూలమల్లలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన అనంతరం రైతు పండించిన ప్రతీ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సహదేవుడు, రాజశేఖర్ రెడ్డి, సుధాకర్, యుగంధర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, నరసింహారెడ్డి, బాబు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

పెద్దమందడి, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి) : బీజేపీ 45వ వార్షికోత్సవ వేడుకలు పెద్దమందడి మండలం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ముప్పూరు చెన్నయ్య బీజేపీ కార్యాలయం ఎదుట పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే మండలంలోని గట్లఖానాపూర్, చిలకటోనిపల్లి, అల్వాల, చిన్నమందడి, వీరాయిపల్లి, పామిరెడ్డిపల్లి గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో చిన్నగుంట రాములు, సుక్క మధు, దత్తాత్రేయరెడ్డి, వెంకటేష్, విట్టల్‌రెడ్డి, స్వాతిరెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.



పెద్దమందడిలో జెండావిష్కరిస్తున్న చెన్నయ్య

మదనాపురం : మండల కేంద్రంలో సోమవారం మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీజేపీని 1980 సంవత్సరంలో స్థాపించి కేవలం ఇద్దరు ఎంపీల గెలుపుతో మొదలై నేడు భారతదేశంలో 15 రాష్ట్రాల్లో సొంతంగా, అయిదు రాష్ట్రాలో ఎన్డీఏ కూటమితో ప్రభుత్వాన్ని నడుపుతుందన్నారు. అదే విధంగా ప్రపంచ దేశాలు సైతం మన దేశం వైపు చూసే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఆంజనేయులు, ఆమర్‌నాథ్, పరశురాముడు, శ్రీనివాస్, కురుమన్న, కొండన్న, బురాన్, యాదగిరి, అజ్జకొల్లు వడ్డెరాజు, చంద్రయ్య గౌడ్, బంగారు రవి, నరసింహగౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో జెండావిష్కరణలో పాల్గొన్న బీజేపీ నాయకులు